# రాంపాల్

కుమారి ఆలపాటి నాగమణి



బయట జోరుగా వర్షం కురుస్తోంది.

నిర్మానుష్యంగా వున్న రోడ్డు వరదగా పారుతున్న నీటివైపు తదేకంగా చూస్తూ, కిటికీ ప్రక్కనే కూర్చున్నాడు ప్రకాశం. చూస్తూ వుండగానే కాలం గడిచిపోవటం ప్రకాశం గమనించలేదనడానికి నిదర్శనంగా, ప్రక్కింటి గడియారం నాలుగు గంటలు కొట్టడంతో ఉలిక్కిపడ్డాడు. చేతివాచీ వంక చూసాడు. సరిగ్గా నాలుగు. అంటే— తాను వెళ్లడానికి మరోగంట టైము వుందన్నమాట.

అంతేకాదు. తన ఆలోచనలకు, మరో గంటలో ముగింపు యిచ్చేయాలి. ఏదో ఒక నిర్ణయానికి వచ్చేయాలి. కాత్యాయని విషయం తేల్చాలి. ప్రసాద్ రాసిన ఉత్తరం లోని ప్రశ్నకు సమాధానంగా, తాను వెళ్లాలో, వెళ్లకపోవడమో ఏదో ఒకటి చేయాలి.

ప్రసాద్ దగ్గరినించి వుత్తరంవచ్చి అప్పటికే నలభైఎనిమిది గంటలు దాటి పోయాయి. ఈ నలభైఎనిమిది గంటల్లో ప్రతినిమిషం తాను ఆలోచిస్తూనే వున్నాడు. అయినా ఓ నిర్ణయానికి రాలేకపోయాడు. ఈనలభైఎనిమిది గంటలు గడచిపోయాయి విలువలేకుండా. తానె నిర్ణయానికి రాలేక పోయాడు. సమస్య సమస్యగానే నిలిచి పోయింది. ప్రశ్నకు తావు మరిన్ని ప్రశ్నలు పెరిగాయితప్ప సమాధానాలు తెలీడం లేదు. మిగిలింది ఒకే ఒకగంట. విలువ గలది.

కాని...ఈ ఒక్కగంటలో తానేం ఆలో చించగలడు. ఉత్తరం వచ్చిన మరుక్షణం నుండీ, తనను అమితంగా వేధించేది ఒకే ఒక ప్రశ్న—అది—కాత్యాయని తనతో పెళ్లి

కంగీకరించిందా ?

కాత్యాయని పెళ్లి తనతో అంగీకరించిందంటె ఆశ్చర్యం, విస్మయం, కలిగి నమ్మలేకపోతున్నాడు.

కారణం — ఒకనాడు కాత్యాయని కళ్లకు తాను కన్పించలేదు. 'మీరు వొట్టి రచయితలు' అంటూ వచ్చేది. అంతేకాదు. రాయటం తప్ప మరేం చేతకాదు. వొట్టి రాతల రాయుళ్లు' అది కాత్యాయని తనగురించి, రచయితల గురించి చేసే వ్యాఖ్య.

ఆనాడు కాత్యాయని మాటలకు బాధ పడ్డా, పైకి కనిపించనీయలేదు. కారణం తను రచయిత కావడమో, లేక తన మనసు మరీ సున్నితం కావడమోకాని, ఈ నాటికీ, కాత్యాయనిని నిందించడం లేదు తను.

కాని, ఈనాడు ప్రసాద్ రాసిన వుత్తరం చదివాకా, ఆనాటి కాత్యాయని మాటలు సవాలు చేస్తున్నాయ్.

భద్రంగా జేబులోదాచిన ప్రసాద్ రాసిన వుత్తరం తీసి తన్మయితంగా ఆకర్షించి సవాలుగా నిలిచిన అక్షరాలవైపు చూసాడు.

'కాత్యాయని, పెళ్ళి కంగీకరించింది. చివరితో తెలుసా ! నీతోనే. దీనికి నీ అంగీకారం వుంటుందనే అనుకుంటున్నాను. కాత్యాయని విషయం నీకు పూర్తిగా తెలుసు. తెలుసని కాత్యాయనే చెప్పింది అంతె కాదు, 'రచయితగారు ఒప్పుకుంటారని నువ్వు చెప్పడం నాకెందుకో నమ్మాలనిపించటం లేదు' అంది నవ్వుతూ.'

'అంటే—తాను రాయడంతప్ప ఏమీ చేయలేని రాతలరాయుడనేనా అర్థం. ఈనాటికి కాత్యాయనికి తనమీద ఆ అభిప్రాయమే వుందా ?' అని అనుకుంటూ ఉత్తరం చివరిపేరా చూసాడు ప్రకాశం.

'నువ్వు శుక్రవారం వరకు వస్తే నీ అభిప్రాయం అడక్కముందె, నాతో చెప్పక ముందే నీ అంగీకారాన్ని అర్థం చేసుకుంటాను. నీకు ఇష్టంలేకపోతే మాత్రం నాకు ఆఫీసుకు ఉత్తరం రాయి—ప్రసాద్.'

'అంటె తనకు కాత్యాయన్ని పెళ్లి చేసుకోవడం ఇష్టం అయి, అంగీకరిస్తేనే శుక్రవారంవరకు వెళ్లాలి. లేకపోతే తిరిగ్గా ఆఫీసుకు ఉత్తరం రాయాలి!

ప్రక్కింటి గడియారం ఓ గంట కొట్టడంతో ప్రకాశం ఉలిక్కిపడుతూ వాచీ వంక చూసాడు. నాలుగున్నర, అప్పుడే అరగంట గడిచిపోయింది.

ప్రకాశం, విసుగ్గా తలవిదిలించి రోడ్డు వంక చూసాడు ప్రకాశం. బయట వర్షం తుంపరగా మారింది. రోడ్డుమీద నీళ్లు మెల్లిగా పారుతూ వున్నయ్. అంతవరకు నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద సైకిళ్లు, రిక్షాలు వెడుతున్నయ్. ఒకటి, అరా చొప్పున.

హఠాత్తుగా లేచి నిలబడ్డాడు ప్రకాశం. గబగబా బట్టలు మార్చుకొని, సూట్‌కేసు లోని డబ్బుతీసి, పర్సులో పెట్టుకొని, రెండుజతల బట్టలను, బ్యాగులో సర్దుకొని. ఓ లీవ్‌లెటర్‌రాసి, కవర్లోపెట్టి, అంటించి, స్టాంపులు అంటించి, జేబులో పెట్టుకొని, గదికి తాళంవేసి, బ్యాగు భుజాన ప్రేలాడేసుకొని బయలుదేరాడు.

రిక్షాలో వెళ్లినా స్టేషన్ కెళ్లేసరికి కొద్దిగా తడిసాడు ప్రకాశం. రైలు కదలడానికి మరో పదినిముషాలుండడంతో టికెట్టు తీసుకొని, ప్రక్కనేవున్న క్యాంటిన్‌లో వేడివేడి కాఫీ తాగి బయలుదేరాడు.

సరిగ్గా రైలు కదిలె సమయానికి కంపార్టుమెంటులో దూరాడు ప్రకాశం. జనం క్రిక్కిరిసి లేకున్నా, దాదాపు సీటన్నీ ప్రయాణికులచేత ఆక్రమించబడ్డాయి. నిలాగైతేనేం—వో పెద్దమనిషి దయతలచి కాస్త చోటిచ్చాడు ప్రకాశానికి. కూర్చోవడానికి ఇబ్బందిగా వున్నా కూర్చోక తప్పలేదు.

తెల్లవారజామువరకు అలాగె కూర్చోవాలేమో అనుకున్న ప్రకాశం వోరెండుగంటలు ఇబ్బందిపడ్డాకా కిటికీ ప్రక్కనే కూర్చున్న మనిషి, బెర్తుమీదికి వెళ్ళిపోవడంతో లేచి అతన్నడిగి, కిటికి ప్రక్కనే వెళ్ళి కూర్చున్నాడు.

అలా కూర్చోవడంవల్ల మిగతావారికి ఇబ్బంది కలగలేదు. ప్రకాశానికి వింతో హాయిగా అన్పించింది. కారణం — కిటికి ప్రక్కనే కూర్చున్నా, థర్డ్‌క్లాసు కంపార్టుమెంటైనా, కంపార్టుమెంటులోని వారు అందరూ మెల్కొనివున్నా, మాట్లాడుతూ, అల్లరిగా, నిశ్శబ్దాన్ని తరిమేస్తున్నా, ప్రకాశం మాత్రం, ఒంటరిగా ఫీల్ కాగల శక్తి, ఒంటరితనాన్ని అనుభవించే శక్తి అతనికున్నాయ్. అంతే దు – అతను అలో చన్లోపడితే తాను రైల్లో ప్రయాణం చేస్తున్నానన్న విషయంకూడా మరిచిపోయి, మరో లోకానికి వెళ్లి పోగలడు.

పరుగెత్తుతున్న రైల్లోనుంచి, బయట దట్టంగా అలుముకుంటున్న చీకటికి తోడుగా, వర్షం, చల్లటి ఈదురుగాలి మొహానికి కొడుతుంటె అలా నిశ్చలంగా కూర్చొని, తదేకంగా ఆలోచిస్తూ పరిసరాలను మరిచిపోయిన ప్రకాశం కళ్లముందు 'ఊహూ...' అంటూ అందంగా నవ్వే కాత్యాయని నిలబడింది.

'కాత్యాయని తనను పెళ్లిచేసుకోవడానికి అంగీకరించింది.'

కాత్యాయని ఈనాడు అంగీకరించింది. కాని...ఒకనాడు ఈ మాట తను కాత్యాయనిని అడగాలనుకున్నాడు.

కాత్యాయనితో తన పరిచయం ప్రసాద్ యింటికెళ్లినపుడు జరిగింది. ఆరోజు తనకు బాగా గుర్తుందికూడా—

'కాత్యాయని ! వీడే ప్రకాశం ! మొన్న పత్రికలో కథ పడిందని చెప్పలేదూ ? వీడిదె' అంటూ, 'ఈవిడ మా పిన్ని కూతురు. బి. ఏ. ఫైనలియర్ చదువుతోంది' అంటూ పరిచయం చేసాడు.

కాత్యాయని తల్లి, తండ్రులు ఏదో పల్లెటూర్లో వుంటారని, కాత్యాయని తన దగ్గరవుండి చదువుకుంటోందని, తెలివైందని ప్రసాద్ చెప్పడం తాను చాలాసార్లు విన్నాడు.

అందుకేనేమొ ప్రసాద్ అంతకంటె ఎక్కువ పరిచయం చేయలేదు. 'నమస్తే !' అన్న కాత్యాయనికి తాను నమస్కరించాడు.

కాఫీలు త్రాగాకా, కాత్యాయని కూడా సంకోచం లేకుండా ఎదురుగా కుర్చీలాక్కొని కూర్చొని చక్కగా మాట్లాడింది.

'మీరు కథలువ్రాయడం ఎన్నాళ్లనించి?' అంది.

'ఈమధ్యేనండి ! నాలుగు సంవత్సరాలు కావొచ్చు' అన్నాడు.

'మీ జవాబుకు, మీ రచనలకు పొత్తు కుదరడంలేదు.' అంది.

'అదేమిటీ ?' అన్నారు.

'మారినకాలం, మారుతున్న కాలంతో మారుతున్న విలువల గురించి ఎంతో చక్కగా రాసె మీరు, నాలుగు సంవత్సరాలను, నిన్నగాక మొన్న అన్నట్టుగా మాట్లాడుతూవుంటే' అంది నవ్వుతూ.

'నిజమే-కాని...నాలుగు సంవత్సరాల నుండి రాస్తోన్న నా రచనలసంఖ్య చాలా

తక్కువ.' అన్నాడు తను.

'అవును. తరమారాసె ఓ రచయిత సంవత్సరంలో రాసే రచనలె మీ నాలుగు సంవత్సరాల రచనలు' అంటూ, ఆగి,—

'అయినా మీరు ఒక్క నవల కూడా యింతవరకు రాసినట్టు లేదూ ?' అంది—

'కథలు రాయటమే అరుదు. పైగా నవలలూనా ?' అన్నాడు ప్రసాద్.

'అవునండి ! ఆఫీసునుండి వచ్చేసరికి అలసిపోతుంటాను. నవల రాయాలంటె...'

'భలేవారె ! అలా అయితె ఈనాడు నవలలు రాసేవారంతా ఆఫీసుల్లో ఉద్యోగాలు చేయడం లేదంటారా ?'

'నిజమే — కాని...నాకంత ఓపికా, ఓర్పూలేవండి !' అన్నాడు నవ్వుతూ.

'ఓపిక వుందనుకుంటె వుంటుంది. లేదనుకుంటె వుండదు. మీ రచనలు నేను చదివాను. మీరు నవల రాస్తారేమోనని చూసాను. ఇప్పుడు రాయండి ప్లీజ్' అంది నవ్వుతూ. కాత్యాయని అంత అందంగా నవ్వుతూ తనను రిక్వెస్టు చేసేసరికి ఉబ్బిబ్బై తత్తరపడి బిత్తరపోయాడు.

మరోసారి వెళ్ళినప్పుడు ప్రసాద్ బజారు కెళ్ళడంతో కాత్యాయని తనను కూర్చో పెట్టి ఎదురుగా కూర్చుంది.

'నవల ఎంతవరకు వచ్చింది ?' అంది.

'నవల ! ఓహ్ ! యింకా ఏది మొదలు పెట్టలేదు. ఎక్కడా థీమ్ దొరకడం లేదండి' అన్నాడు.

'మానవ ప్రయత్నం అంటూ వుంటె చేయలేంది లేదంటూ కథల్లో రాసే మీరు, మామూలు నవల రాయడానికి యిలా మాట్లాడ్డం, తప్పించుకోవడం ఏం బావు లేదు సార్ ! రాసింది ఆచరించటంలో కష్టమేమిటి ? కష్టమని అనుకున్నప్పుడు రాయడం దేనికి ? ఆలోచించండి ! రాయా లంటె మీకు థీము దొరకదూ ?' అంది.

'వచ్చాం ?' అనుకుంటూ తలూపాడు తను.

ఆతర్వాత మరో కథ తనది పత్రికలో పడింది. ఆ కథ చదివి కాత్యాయని చిత్రంగా నవ్వింది.

'రచయితగారూ ! వాస్తవానికి దూరంగా అసహజంగావున్నా, చాలా బావుందండి మీ కథ' అంది.

'వాస్తవానికి దూరంగా వుందా ?' విస్తుపోయాడు.

'కాదూ మరి ! ఒక ఆడది ఒక మగవాడిని ప్రేమించి, అతను పెళ్ళి చేసుకోనంటె మరొకరిని పెళ్ళి చేసుకో వడం, నిజంగా నాకు చాలా నచ్చింది. అలా పెళ్ళి అనేసరికి, ప్రేమా గీమా అన్నీ మరిచి వెనుకంజవేసె పిరికివాళ్ళకోసం, పెళ్ళిచేసుకోనంటూ, పిరికితనంతో నిర్జీవమై విలువకోల్పోయిన ఆ ప్రేమ కోసం, త్యాగం అంటూ, ఒంటరిగా మిగిలిపోయే ఆడవాళ్ళంటె నా కసహ్యం. అలా కాకుండా జీవితానికి విలువతెలిసి బ్రతుకును సుఖమయం చేసుకోవాలనే మీ సందేశం నాకు చాలా నచ్చింది. పోతే— ఆ అమ్మాయి తనకు కాబోయేభర్తకు తన గతించిన ప్రేమగాథ చెప్పడం, అంతా విని, అతడు, ఎంతో సంస్కారంతో, 'అయినాసరె నీ సంస్కారానికి నిజాయతికీ నా జోహార్లు' అంటూ పెళ్ళి చేసుకోవటం మాత్రం అసహజం. జరగదు. ఒకవ్యక్తిని మోసం చేయకూడదనే మంచితనంలో నిజం చెబితె అర్థం చేసుకునే ఔన్నత్యం యింకా మగవాళ్ళు ఎదగలేదేమో అన్పి స్తోంది నాకు' అంది.

'ఎందుకలా అనుకుంటున్నారూ ?'

'ఎందుకంటే—మగవాడు ఒక ఆడదాన్ని ప్రేమించి, మరో ఆడదాన్ని పెళ్ళిచేసుకోవ డానికి అంగీకరిస్తాడు కాని, తెలిసి, తెలిసి, తనకు కాబోయేభార్య, ఒక మగవాణ్ణి ప్రేమించి, తనను పెళ్ళాడుతోందంటె అసలు అంగీకరించడు. ఆమె నిజాయతీని అర్థం చేసుకోడు.'

'తనను ప్రేమించదనే భయం వుంటుం దనా, మీ అభిప్రాయం ?'

'భయం అయితె పోగొట్టొచ్చు ! కాని అది భయంకాదు. మనిషిని హీనస్థితికి దిగజార్చి, ఘోరంగా ఆలోచింపజేసె అనుమానం. మారిన భార్య మనసును, ఆమెలోని నిజాయతిని, అర్థం చేసుకోని...' యింకేం అంటుందోనని కాత్యాయని మాట లను మధ్యలోనే అడ్డుకున్నాడు తను.

'ఆడవాళ్ళకు మాత్రం ఆ అనుమానం వుండదంటారా ?' అన్నాడు.

'వుండడానికి ఆస్కారంవుంటేగా ?' అంది.

'అంటె.'

''నేను ఆడదాన్ని ప్రేమించి, పెళ్ళి అనేసరికి, పిరికివాడిలా పారిపోయి వచ్చాననో, మోసం చేసాననో, పరిస్థితులకు లొంగి పోయాననో ఎవ్వరూ కాబోయే పెళ్ళానికి చెప్పరు. చెప్పినా, ఈ సంఘం అతని తరఫున వకాల్తా పుచ్చుకుంటుంది. మగ వాడు ఏం చేసినా తప్పు అని అనకూడదు అని అంటుంది.'

'అయితే ఆడవాళ్ళు మాత్రం చెబు తారా ?' అన్నాడు అప్పటివరకు గుమ్మంలో నిలబడే వింటున్న ప్రసాద్.

'చెప్పరు. కాని...సంఘం చేయూత నివ్వని, 'ఆడది' అంటూ 'ఆరిటాకు' అంటూ విలువ యివ్వని ఆడదాని, ప్రేమ విషయం, పెళ్ళికాకముందే తెలిసిపోవడానికి అవకాశం వుంది. పెళ్ళి ఆగిపోతుంది. ఫలితం అంతే చివరికి.'

'ఒకవేళ పెళ్ళి జరిగాకా తెలిసినా ఆ సంసారం - సుఖసారం అనె పాట పాడు కోవడానికి, కనీసం, ఆ మాట ఆ యింట్లో వినడానికి అవకాశం, అగ్నాతా కోల్పోయి, నరకంలా తయారవుతుంది.'

'ఒక్కవిషయం రచయితగారూ ? ఆడ దానికి పరిష్కారం వుంటుందని రాసి నందుకు, గ్రహించినందుకు థ్యాంక్స్ !' అంది.

'సంఘం ఎంత వకాల్తా పుచ్చుకున్నా, భార్యకు పెళ్ళయిన తరువాతైనా తెలు స్తుంది కదా!' అన్నాడు తను సంభాషణను పొడిగిస్తూ.

'కాని ఏం లాభం? భార్యను వొదిలేస్తే మగాడిని సమర్థిస్తుంది సంఘం. భర్త నొదిలేసిన భార్యను విమర్శిస్తుంది. హమ్మయ్యో! ఎంత ఘోరం అని ముక్కు మీద వేలువేసుకొని చేతనైనంత వరకు కష్టపడి, ఆవిడను చేటల్తో చెరిగేస్తుంది కదండి!' అంది.

'మా ఊళ్ళో మునసబుగారి రెండో అబ్బాయి వున్నాడు లెండి. ఆయనకు పెళ్ళి కాక ముందె పట్నంలో ఒకావిడ, ఊళ్ళో ఒకావిడ, అవసరానికి ఉపయోగించుకునే ఆట బొమ్మల్లాంటి ఆడవాళ్ళున్నారు.

'ఇద్దరితో ఎలా వేగుతావురా అబ్బాయ్! మరోదానిని కూడా చేర్చుకో! ముగ్గురితో

ముచ్చటగా వుంటుందన్నట్టు మునసబు గారు అతనికి పెళ్ళి చేసారు. ఆవిడ అందరి ఆడవాళ్ళకు మల్లె కాకుండా, భర్త జరిపే వ్యవహారం తెలిసి, వాళ్ళిద్దరు కావాలో తను కావాలో తేల్చుకో మంది. కాస్త గడుసుతనం వుందేమో మరి. మరీ మొండిగా నిలేసి అడగడంతో ఆయన వాళ్ళను, వాళ్ళతోపాటు, ఈవిడ్ని కూడా వొదలుకోలేనన్నాడు. ఆవిడకు కోపం వచ్చి పుట్టింటికి వెళ్ళిపోయింది.

అతని విషయం ఊళ్ళో అందరికి తెలుసు. కాని అందరూ ఆవిడలా వెళ్ళిపోయినందుకు హర్షించలేదు వాళ్ళను వొదులుకోమని చెప్పలేదు కనీసం సలహా ఇవ్వలేదు. పైగా ఆవిడ్ని నిందించారు. 'మగవాడు—ఏన్ని పనులైనా చేస్తాడు. అలాగని ఆడది యిలా సంసారం, భర్తను వొదిలి పోతుందా? పతివ్రతేనా? ఆడదాని లక్షణమేనా?' అంటూ నోహ్...ఏన్నో అనుకున్నారు. పాపం! ఆవిడ ఏంతో అభిమానంతో వెళ్ళిపోయింది. కాని వాళ్ళ ఊళ్ళో కూడా అందరు ఆమెనే అనడంతో తిరిగి వచ్చింది. 'పతియే దైవము' అంటూ. చెప్పొద్దూ! నాకు బోల్డంత చిరాకు వేసింది' అంది కాత్యాయని నవ్వుతూ.

కాత్యాయని మాటలకు తను ప్రసాద్ నవ్వారు.

'మీరు చెప్పండి రచయితగారూ! మీరు రచయితలు సంస్కారం, హృదయం అంటూ రాస్తుంటారు కదా, నిజంగా మీ కథలో లాగె ఒకమ్మాయి తారసపడితే మీరు అంతా తెలిసి కూడా అలాంటమ్మాయిని పెళ్ళాడతారా?' అంది సూటిగా చూస్తూ.

వెంటనే ఏం సమాధానం చెప్పాలో తోచలేదు తనకు.

కాత్యాయని ఫక్కున నవ్వేసింది— 'రచయితలైనా మీరు మగవారె. రాతలు చేతల వరకు వచ్చేసరికి మాసిపోతాయండి' అంది.

అంతేకాదూ 'మీరు ఉత్త రచయితలు. రాయడం తప్ప మరేం చేయలేనివారు' అంటూ కేవలం రాతల రాయుడిగా మార్చి వచ్చేసింది.

కాత్యాయనిని చేసుకునేవాడు అదృష్టవంతుడు అనుకున్నాడు తను; కాత్యాయనిని చేసుకోవడం వల్ల వచ్చే అదృష్టం ఏమిటో తను నిజంగా అనుకున్నప్పుడు ఆలోచించలేదు కాని...కాత్యాయని తనను ఆకర్షించింది.


షికాకాయ్
భారత స్త్రీల
అందమైన జుట్టుకు
పారంపర్యమైన రహస్యము



స్వస్తిక్
షికాకాయ్
షాంపూ సబ్బు
పారంపర్యత, సౌఖ్యముల కలయిక
—మీ కుటుంబ ఉపయోగమునకు
ఒక ఆధునికమైన సబ్బు బిళ్ళ.
Shilpi-HPMA-6A/72 TEL

# రచయిత

అంతలోనే ఉద్యోగం తనకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ చేతిలో పెట్టి దూరంగా విసిరేసింది. ప్రసాద్‌తో తన మనసులోని మాట చెప్పాలనుకున్న క్షణంలోనే—

'వేణు నిజంగా ఉత్తమ ప్రకాశం! చిన్నప్పటి నుండి కాత్యాయనిని వాడి కివ్వాలని అందరం అనుకున్నాం. వేణుకు కూడా కాత్యాయని అంటె చాలా ఇష్టం. మేనరికం వుందనే కాత్యాయనికి పెళ్ళి సంబంధాలు చూడక బి. ఏ వరకు చదివించారు పిన్ని, బాబాయ్! ఈ మధ్య వాడి మనసు తిరగబెట్టింది. కాత్యాయనిని పెళ్ళి చేసుకోనంటూ చెప్పాడు. ఈ వేసవిలో కాత్యాయని పెళ్ళి ఎలాగు చేయాలనుకుంటున్నారు; పిన్ని, బాబాయ్, నువ్వు తప్పకుండా వస్తావు కదూ!' అన్నాడు ప్రకాశం తను ఊరు విడిచి వచ్చేరోజు.

తలూపాడు తను. చెప్పాలనుకున్న మాట రైలు కూతలో కలిసి పోయింది. తను రచయిత. కులం మతం లేదంటూ రాయగలడు. ఆచరించి చూపించగలడేమో! కాని... కాత్యాయని, తల్లి, తండ్రి—? వ్చ్... ఏ మూలో వున్న చిన్న కోరిక పెరికి పారేసాడు.

కాని...ఆ వేసవిలో కూడా కాత్యాయని పెళ్ళి జరగలేదు. ఎందుకో తనకు తెలియదు. కాత్యాయని ఎమ్. ఏలో చేరిందని ప్రసాద్ ఉత్తరంలో రాసాకా, కాత్యాయని గురించి తనకేం తెలీదు. తిరిగి రెండేళ్ళకు ప్రసాద్ ఉత్తరం రాసాడు: అది—

కాత్యాయని తనతో పెళ్ళికంగీకరించిందని! తనకెంతో ఆ...శ్చ...ర్య...ం వేసింది. వేస్తోంది కూడా.

ప్రయాణపు బడలిక తీరేలా నిద్రపోయి, సాయంత్రం నాలుగ్గంటలకు నిద్ర లేచాడు ప్రకాశం.

'ఒరేయ్! రేపు బాబాయ్ దగ్గరికి వెళ్ళి మాట్లాడదాం! పోతే—సాయంత్రం కాత్యాయని వస్తుంది. నీ యిష్టం ఏమిటో! ఏదైనా మాట్లాడాలని వుంటే మాట్లాడేయ్!' అంటూ ఉదయం రైలు దిగి యింటికి రావటంతోనే సరోజకు తన నప్పగించి, మరేం అడగకుండానే ఆఫీసుకు వెళ్ళిపోయిన ప్రసాద్ మాటలు గుర్తుకొచ్చాయి.

ప్రకాశం మొహం కడుక్కుని వచ్చేసరికి సరోజ కాఫీ అందించింది.

'వాడెప్పుడు వస్తాడూ ?' అన్నాడు ప్రకాశం.

'ఆరు దాటుతుందన్నయ్యా !' అంది సరోజ. అప్పుడే వరస కూడా కలిపేసి ఎంతో కలుపుగోరుగా మాట్లాడే సరోజను చూస్తుంటే ముచ్చట వేసింది ప్రకాశానికి.

కాఫీ త్రాగి బట్టలు వేసుకుంటుండగా కాత్యాయని వచ్చింది. ఎందుకో ఆశ్చర్యపోతూ పలకరించింది. కాసేపు ఏదేదో మాట్లాడాక, పార్కుకేసి బయలుదేరారిద్దరు.


దారి వెంట ఎంతో మౌనంగా వుంది కాత్యాయని. దీర్ఘంగా ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా వెంట వస్తున్న కాత్యాయని అర్థం కాలేదు ప్రకాశానికి.

'కాత్యాయనికి తనంటే ఇష్టమేనా ?' అన్న ప్రశ్న మనసును పీకుతుంటే సంకోచించకుండా అడిగాడు ప్రకాశం.

'నా అభిప్రాయం కనుక్కొనే అన్నయ్య వుత్తరం రాసాడు. మీరు వస్తారని నేను అనుకోలేదు. వచ్చారు. ముందు మీ యిష్టం చెప్పండి' అంది.

'ఇష్టం లేకపోతే వచ్చేవాణ్ణి కాదు కాత్యాయని. నా కభ్యంతరం వుంటుందని మీరేమన్నా అనుకుంటున్నారా ?' అన్నాడు ప్రకాశం. కాత్యాయని చిన్నగా నవ్వింది.

'రచయితగారూ! ఒకనాడు రాసిన కథలోని పాత్రే ఎదురుపడి జీవితంలో ఆడ



సంఘటనగా, సవాలుగా ఎదురు నిలవటం అదృష్టమంటావా ? లేక దురదృష్టమంటావా ?' అంది.

'రెండు కావు. పరీక్ష అంటాను.' అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

'రచయితగారూ! నిజంగా నేను సీరియస్‌గా అడుగుతున్నాను.' అంది కాత్యాయని సూటిగా చూస్తూ.

'జవాబు నవ్వుతూ చెప్పినంత మాత్రానా సరైన జవాబు, కాకపోతుందా కాత్యాయనీ?' ప్రకాశం ఎదురు ప్రశ్నించడంతో మౌనం వహించింది కాత్యాయని.

'నేను బి. ఏ. సెకండియర్‌లో వుండగా భాస్కరంతో పరిచయం అయింది' అంది కళ్లెత్తి ప్రకాశం వంక చూస్తూ.

'ఊఁ...తరువాత!' అన్నాడు ప్రకాశం మమూలుగా.

'నేను భాస్కరాన్ని పెళ్ళి చేసుకోవాలనుకున్నాను.'

'కాని పెళ్ళి జరగలేదు.'

'అవును. బావతో నా పెళ్ళి చిన్నప్పుడే స్థిరమైందంటూ నాన్న అమ్మ ఎంతగానో చెప్పారు. కాని నేను విన్లేదు. కాని...వాళ్ళ నెదిరించి నన్ను పెళ్ళి చేసుకోవడానికి ధైర్యం లేకపోయింది భాస్కరానికి. పాతికేళ్లొచ్చినా, పసిపాపాయిలా అమ్మ ఒడిలో పడుకొని గారాలు పోయే భాస్కరం ఆ అమ్మగారే వద్దన్నారని చెప్పాడు. నేను బాధ పడలేదు.'

'చివరికి బావను చేసుకుంటాననే అమ్మతో చెప్పాను. కాని ... భాస్కరంతో వున్న నా పరిచయం బావకు తెలిసింది. నేను కూడా అంతా చెప్పాను. కాని... బావకు నా మీద నమ్మకం లేకపోయింది. పెళ్ళి కంగీకరించలేను.' అంటూ నవ్వింది. బిత్తరపోయాడు ప్రకాశం.

సరిగ్గా ఆ సమయంలోనే మీ కథ పడింది. మీ కథ చదివాకా నా కెందుకో నవ్వు వచ్చింది. అందుకే వాస్తవంగా లేదన్నాను. నిజం చెప్పినా బావ నన్ను నమ్మలేదు. కాని మీ కథలో స్త్రీకి వున్న సంస్కారం, నిజాయితీని మెచ్చుకొని పెళ్లి చేసుకునే మగవాడిని చూసాకా, మగవాళ్ళు కథల్లో తప్ప నిజ జీవితంలో ఎదగలేదన్నాను' అంది.

రెండునిమిషాలవరకు మౌనంగా కూర్చున్న కాత్యాయని వరికె కుతూహలంగా చూస్తూ 'ఊఁ...' అన్నాడు ప్రకాశం.

'నేను కథ చెప్పటంలేదు' అంది కాత్యాయని. చిరాకు పడుతున్నట్లుగా.

'అవును. నిజం చెప్పావు కాత్యాయని' అన్నట్టు ఇందాకా పరీక్ష అన్నాను కదూ! రిజల్టు ఏమిటో చెప్పనా ?' అన్నాడు చిలిపిగా చూస్తూ. కాత్యాయని ఆశ్చర్యంగా చూసింది.

'నేను గెలిచాను కాత్యాయని.' అన్నాడు ప్రకాశం ఉత్సాహంగా.

'ప్రకాశంగారూ! ఇది పెళ్లి, రెండు ముడిపడే జీవితాల సమస్య. మొహమాటం అంటూ ... సీరియస్‌గా అనబోయింది కాత్యాయని.

'నో...జీవిత సమస్య అనే, మామూలు మనిషికన్నా, రచయితగా నేను ఎక్కువ ఆలోచిస్తానే కాని మొహమాటానికి చోటు లేదు కాత్యాయని. మీ మీద నాకు నమ్మకం వుంది' అన్నాడు ప్రకాశం నిశ్చలంగా.

'ఉహూఁ' అంటూ కాత్యాయని అందంగా నవ్వింది. ఆమె నవ్వు ఏదో ఊహ రేపగా ఏదో ఊహించుకుంటూ, ఊహల్లో తేలిపోతూ, కొత్త కథకోసం ప్లాటు వెతుక్కుంటూ పరధ్యానంలో పడిపోయాడు రచయిత ప్రకాశం. ●


# * స న్నా జా జి *

సచిత్ర మాస పత్రిక

**సంపాదకుడు: పేకుమళ్ల ప్రభురెడ్డి**

చిక్కని కథలు, చక్కని సీరియల్సు, కమ్మని కవితలు, ఉప్పు—నిప్పు, కాకరకాయ కబుర్లు, తాజా సినిమావార్తలు, సంపాదక సమాధానాలు, మీరు మెచ్చే ప్రముఖుల,మీరు నచ్చేనూతన రచయిత(త్రు)ల రచనలతో సాహితీ సౌరభాలను, వెదజల్లడానికి జూనులో వస్తున్నది సన్నజాజి.

## ఏజెన్సీ వివరాలకు:—మేనేజర్, "స న్నా జా జి"

15—4—52/55, గౌలిగూడ చమన్, హైదరాబాద్—500012, ఫోన్: 46681.



# సెయింట్ ఆంబ్రోస్ హైస్కూలు నిడదవోలు

రికగ్నైజడ్ స్థాపితం : 1968

**నవీన సదుపాయములు గల వసతి గృహం**

* సువిశాలమైన 3 అంతస్థుల భవనం

* అనుభవజ్ఞులయిన ఉపాధ్యాయ బృందం * విశాలమైన ఆట స్థలములు

**మా పరీక్షా ఫలితములు :—**

1970 సం.లో 10 వ తరగతిలో కృతార్థులయినవారు 64 %
1971 సం.లో 10 వ తరగతిలో కృతార్థులయినవారు 100 %
1972 సం.లో 10 వ తరగతిలో కృతార్థులయినవారు 98 %

**ప్రవేశములు ఇవ్వబడుచున్నవి** (1973—74 సం. నకు)

వివరములకు :— **రివరెండ్ ఫాదర్ జోస్ క్లైమ్‌లెట్**

కరస్పాండెంట్

**సెయింట్ ఆంబ్రోస్ హైస్కూలు**

**నిడదవోలు**, ప. గో. జిల్లా (ఆం.ప్ర.) ఫోన్ నెం: 154